సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 26 । సెప్టెంబర్ । 2024



వేట సాగదు..

మత్స్యకారులకు ఇబ్బందులు తప్పడం లేదు. వేట సాగకపోవడంతో జీవనాధారం భారమైంది. - 8లో



అవినీతి బాగోతం

బీసీ వెల్ఫేర్‌లో అవినీతి బాగోతం వెలుగు చూసింది. గుట్టుచప్పుడు కాకుండా విజయవాడలో దర్యాప్తు సాగుతోంది. - 8లో

తలనీలాల పాట వాయిదా

అరవసల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో తలనీలాల వేలం పాట మరోసారి వాయిదా పడింది. బుధవారం ఆలయ మండపంలో వేలం నిర్వహించగా ఒకే ఒక వ్యక్తి హాజరుకావడంతో వాయిదా వేస్తున్నట్లు జిల్లా దేవదాయ శాఖాధికారి ప్రసాద్ పట్నాయక్, ఆలయ ఈవో డి.ఎల్.వి.రమేష్‌బాబు ప్రకటించారు. తదుపరి తేదిని త్వరలో ప్రకటిస్తామన్నారు.

న్యూస్‌రీల్

ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా శ్రీకాంత్ రెడ్డి

శ్రీకాకుళం క్రైమ్ : అక్టోబరు 1 నుంచి మారనున్న కొత్త మద్యం పాలసీలో భాగంగా జిల్లాకు కొత్త ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్‌గా డి.శ్రీకాంత్‌రెడ్డిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన కాకినాడ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌గా పనిచేసి బదిలీపై ఇక్కడికి వస్తున్నారు. గురువారం విధుల్లో చేరనున్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో శ్రీకాకుళం సూపరింటెండెంట్‌గా ఉన్న సీహెచ్ తిరుపతినాయుడు రిలీవై మాతృసంస్థ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ విభాగ జిల్లా అధికారిగా నియమితులయ్యారు. ఎచ్చెర్ల కేంద్రంగా ఉన్న బాట్లింగ్ డిపో మేనేజర్‌గా, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వర్తించిన బి.సుబ్బారావు డీఎంగా బదిలీ అయ్యారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురి అరెస్టు



పట్టుబడిన నిందితులతో ఎస్పీ మహేశ్వరరెడ్డి, పోలీసు అధికారులు

కాశీబుగ్గ: గంజాయి రవాణా కేసుల్లో ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి తెలిపారు. బుధవారం కాశీబుగ్గ పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు వివరాలు వెల్లడించారు. ఇచ్ఛాపురం రైల్వేస్టేషన్ నుంచి సూరత్‌కు 82.200 కేజీల గంజాయిని అక్రమంగా తరలిస్తుండగా ఇద్దరు వ్యక్తులు పట్టుబడ్డారని, అదే విధంగా పలాస మీదుగా హైదరాబాద్‌కు 1.33 కేజీల గంజాయిని తరలిస్తున్న మరొక వ్యక్తిని మొగిలిపాడు ఫ్లై ఓవర్ జంక్షన్ వద్ద పట్టుకున్నట్లు ఎస్పీ వివరించారు. గత 20 రోజుల్లో జిల్లాలో 12 గంజాయి కేసులు నమోదు చేసి 31 మంది నిందితులు అరెస్ట్ చేశామని, సుమారు 230 కేజీల గంజాయిని సీజ్ చేశామని వివరించారు. గంజాయి తాగుతూ పట్టుబడిన 17 మందిని డి–ఎడిక్షన్ సెంటర్‌కు పంపించామని చెప్పారు. ఈ ఏడాదిలో 23 కేసుల్లో 70 మందిని అరెస్ట్ చేశామన్నారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణా అరికట్టేందుకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను నియమించామని చెప్పారు. జిల్లాలో గంజాయి సాగు లేనప్పటికీ సరిహద్దు రాష్ట్రాలు, జిల్లాల నుంచి అధిక మొత్తంలో గంజాయి రవాణా జరుగుతోందని, దీనిని అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేశామన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐలు డి.మోహన్, ఎం.చిన్నంనాయుడు, ఎస్‌ఐ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

యూరియా కోసం పీఏసీఎస్ వద్ద పడిగాపులు కాస్తున్న రైతులు



ఈ చిత్రంలో ఉన్న భవనం వజ్రపుకొత్తూరు మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయం. అక్కడున్న వారంతా రైతులు. ఎరువుల కోసం వివిధ గ్రామాలకు చెందిన వారంతా బుధవారం ఉదయం 8 గంటలకే చేరుకున్నారు. కార్యాలయం తాళం తీయకపోవడంతో అత్యధిక సంఖ్యలో రైతులు అక్కడికి చేరుకుని గంటల కొద్దీ క్యూలో నిలబడ్డారు. అప్పటికే ఓపిక నశించిన రైతులు ఒక్కసారిగా ఎరువుల కోసం ఎగబడ్డారు. దీంతో కొద్దిపాటి తోపులాట చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సద్దుమణిగించారు. అయితే రైతులు మాత్రం తీవ్ర అసహనం వ్యక్తం చేస్తూ కూటమి ప్రభుత్వంపై తిట్ల దండకం అందుకున్నారు. ఇదేం ప్రభుత్వంరా.. బాబూ అంటూ శాపనార్థాలు పెట్టారు.

మంచి ప్రభుత్వం అంటే ఇదేనా..!



వజ్రపుకొత్తూరు రూరల్:

- కూటమి సర్కారుపై రైతుల మండిపాటు
- ఆర్‌బీకేలను కాదని పీఏసీఎస్ వద్ద ఎరువుల పంపిణీ
- గంటల తరబడి తప్పని నిరీక్షణ
- అయినా అందని ఎరువులు
- పాత రోజులు మళ్లీ గుర్తుకు తెస్తున్నారని ఆగ్రహం
- గత్యంతరం లేక ఒడిశా నుంచి తెచ్చుకుంటున్న అన్నదాతలు

రైతులకు మళ్లీ కష్టాలు మొదలయ్యాయి. అన్నదాతలకు అన్ని వేళలా అండగా ఉంటామని అధికారంలోకి వచ్చిన కూటమి నాయకులు ఆదిలోనే చేతులెత్తేయడంతో రోజురోజుకూ ఇబ్బందులు ఎక్కువవుతున్నాయి. ముఖ్యంగా ఎరువుల పంపిణీలో ఘోరంగా విఫలమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామ స్థాయిలోనే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, యంత్రాలు, పని ముట్లతో పాటు పంట సాగుకు సంబంధించి అవగాహన సదస్సులు నిర్వహించి అన్ని విధాలా అండగా నిలిచారు. ఇప్పుడంతా అస్తవ్యస్తంగా మారడంతో పాటు తమ సమస్యలను పట్టించుకునే వారే కరువయ్యారని రైతులు మండిపడుతున్నారు.

ఇదీ పరిస్థితి..

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వాతావరణ పరిస్థితులు అనుకూలించడంతో రైతులు ఎన్నో ఆశలతో పంట సాగుకు సిద్ధమయ్యారు.

- జిల్లా వ్యాప్తంగా సుమారు 4.20 లక్షల ఎకరాల్లో దాదాపుగా 4 లక్షల మంది రైతులు పంటలను సాగు చేస్తున్నారు.
- వేలాది రూపాయలు ఖర్చుపెట్టి దమ్ములు, గట్లను సరిచేయడం, విత్తనాలు కొనుగోలు చేసి వరినాట్లు వేశారు.
- మరి కొందరు ఎద పద్ధతిన వరి పంటను సాగు చేస్తున్నారు.
- అయితే పంట ఎదుగుదలకు అవసరమైన ఎరువులు మాత్రం కరువయ్యాయి. దీంతో రైతులు ఎరువులు దొరక్క అగచాట్లు పడుతున్నారు.
- గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల ద్వారా పంట ప్రారంభంలో అరకొర ఎరువులు అందించి తర్వాత ఆ కేంద్రాలను నిర్వీర్యం చేశారు.
- మళ్లీ గత టీడీపీ ప్రభుత్వ పాలనకు తెరలేపి ప్రాథమిక వ్యవసాయ పరపతి(పీఏసీఎస్)సంఘాల ద్వారా పంపిణీ చేపడుతున్నారు.
- అధికారాన్ని అడ్డం పెట్టుకొని కొంత మంది కూటమి నాయకుల ఇళ్లలో ఎరువులను నిల్వలు పెట్టి వారికి అనుకూలంగా ఉన్న వారికి అందిస్తున్నట్లు పలువురు విమర్శలు గుప్పిస్తున్నారు.
- ఈ విషయంలో అధికారులు సైతం చేతులెత్తేయడంపై రైతులు మండిపడుతున్నారు. పోనీ బహిరంగ మార్కెట్‌లో ఎరువులు కొనుకుందామన్నా అక్కడి ధరలు చూసి హడలిపోతున్నారు.

అన్నదాతపై అదనపు భారం..

ప్రస్తుతం వరిసాగుకు యూరియా అవసరం ఎక్కువగా ఉంది. ప్రభుత్వం రాయితీపై 50 కేజీల యూరియా బస్తాను రూ.265లకు సొసైటీలకు అందిస్తుంది. పీఏసీఎస్ కార్యాలయానికి రైతులు పాస్ బుక్, ఆధార్ కార్డుతో వెళ్లి రూ.280 చెల్లిస్తున్నారు. ఎరువులను ఇంటికి చేరవేసేందుకు కూలీ చార్జీలు, ఆటో చార్జీలు మరింత అదనంగా ఖర్చవుతోందని వాపోతున్నారు. ఆర్‌బీకేలు, పీఏసీఎస్‌ల వద్ద ఎరువులు దొరక్కపోవడంతో ప్రైవేట్ మార్కెట్‌లో ఒక్కొక్క యూరియా బస్తా రూ.350 నుంచి రూ.400కు షరతు పెట్టి విక్రయిస్తున్నారు. యూరియా కావాలంటే తమకు ఉపయోగం లేని ఎరువులను బలవంతంగా కొనుగోలు చేయిస్తున్నారని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదేం గొడవరా బాబు అంటూ కొంత మంది రైతులు ఒడిశా నుంచి ఎరువులను తెచ్చుకుంటున్నారు.

జిల్లాలో ఇలా..	ఖరీఫ్ సాగు	వరి సాగు	మొక్కజొన్న	కావాల్సిన ఎరువులు
	4.20 లక్షల ఎకరాలు	3,53,085 ఎకరాలు	19,500 ఎకరాలు	1.70 లక్షల టన్నులు

'వెన్ను' విరుస్తున్న కూటమి ప్రభుత్వం..

దేశానికి రైతే వెన్నెముక అంటూ చెబుతున్న నాయకులే నేడు ఎరువుల కొరత సృష్టిస్తూ వారి వెన్ను విరిస్తున్నారు. పంట సాగులో ఎంతో కీలకంగా ఉన్న ఎరువులు సకాలంలో అందించక వారికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇప్పుడు వాత పెట్టారని మండిపడుతున్నారు. ఆర్‌బీకేలను నిర్వీర్యం చేసి పీఏసీఎస్‌ల వద్ద ఇలా గంటల కొద్దీ పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు.

గతంలో బాగుండేది..



గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల వద్దకు వెళ్లి ఎరువులు తీసుకున్నాం. ఎలాంటి ఇబ్బంది లేకుండా నేరుగా దొరికేవి. అప్పట్లో చాలా బాగుండేది. ఇప్పుడు యూరియా కావాలంటే ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. 15 ఎకరాల్లో పంట సాగు చేస్తున్నాను. ఎరువుల అవసరం ఎక్కువగా ఉంది.

– డి.జోగారావు, రైతు, గుళ్లలపాడు, వజ్రపుకొత్తూరు మండలం

గత ప్రభుత్వంలో రైతే రాజు..



వైఎస్సార్ సీపీ పాలనలో అక్కవరం ఆర్‌బీకే వద్ద ఎరువులు అందజేస్తున్న సిబ్బంది

గత ప్రభుత్వ హయాంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా నేరుగా ఎరువులు రైతులకు చేరేవి. గ్రామస్థాయిలోనే రైతు భరోసా కేంద్రం ఉండటంతో అగ్రికల్చర్ అసిస్టెంట్ వద్ద రైతులు బయోమెట్రిక్ వేసి వారికి అవసరమైన ఎరువులను ప్రభుత్వ రాయితీపై పొందేవారు. వారికి ఎలాంటి అదనపు ఖర్చులు, కష్టం లేకుండా సకాలంలో అందటంతో ఆనందం వ్యక్తం చేసేవారు.

ఎరువుల పంపిణీలో విఫలం..



కూటమి ప్రభుత్వం సూపర్ 6 పథకాలు అమలు చేయలేదు. కనీసం అన్నం పెట్టే అన్నదాతలకు సకాలంలో ఎరువులు కూడా అందించడం లేదు. గత ప్రభుత్వంతో పోల్చుకుంటే రైతులకు ఈ ప్రభుత్వంలో ఇబ్బందులు తప్పవు అనిపిస్తుంది.

– టి.బాలకృష్ణ, కౌలు రైతు, గల్లి, వజ్రపుకొత్తూరు మండలం

ఉదయం 8 గంటలకు వచ్చా..



నేను 4 ఎకరాలు భూమిని సాగు చేస్తున్నాను. యూరియా కోసం ఉదయం 8 గంటలకు పీఏసీఎస్‌కు వచ్చాను. తప్పని పరిస్థితిలో గంటల కొద్ది లైన్‌లో నిలబడ్డాను. మళ్లీ పాత రోజులు గుర్తుకొచ్చాయి.

– కణితి కృష్ణారావు, రైతు, బెండి, వజ్రపుకొత్తూరు

● చదువుతున్న బడిలోనే..

మృత్యు ఒడికి..



నిర్మాణ దశలో ఉన్న భవనం ఇదే

- నిర్మాణంలో ఉన్న పాఠశాల స్లేడ్ కూలి విద్యార్థి మృతి
- మరో విద్యార్థికి తీవ్ర గాయాలు
- పాతర్లపల్లిలో తీవ్ర విషాదం



ఘటనా స్థలంలో మృతుడు కృష్ణంరాజు



ప్రమాదానికి కారణమైన భవనం స్లేడ్

విషాదం

రణస్థలం: కూలి పనులు చేసుకుంటూ తమ బిడ్డను చదివిస్తున్న ఆ తల్లిదండ్రుల ఆశలు అడియాసలయ్యాయి. కుమారుడిని షెడ్డు రూపంలో మృత్యువు వెంటాడటంతో తల్లిదండ్రులతో పాటు తోటి విద్యార్థులు శోకసంద్రంలో మునిగిపోయారు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రణస్థలం మండలం పాతర్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న వనం కృష్ణంరాజు(15) మరో విద్యార్థి కోరాడ శ్రీరామ్‌తో కలిసి బుధవారం మధ్యాహ్నం 2.40 గంటల సమయంలో ఆడుకుంటూ నిర్మాణ దశలో ఉన్న పాఠశాల భవనంలోకి వెళ్లారు. స్లేడ్‌పైకి ఎక్కగానే ఒక్కసారిగా కూలిపోయింది. కృష్ణంరాజు పూర్తిగా స్లేడ్ క్రింద ఉండిపోగా, శ్రీరామ్ కాళ్లు పలక కింద చిక్కుకున్నాయి. వెంటనే తోటి విద్యార్థులు కేకలు వేయగా ఉపాధ్యాయులు, స్థానికులు వచ్చి ఇద్దరినీ బయటకు తీశారు. కొన ఊపిరితో ఉన్న కృష్ణంరాజును అర కిలోమీటరు దూరంలో ఉన్న పాతర్లపల్లి పీహెచ్‌సీకి బోర్డుపై మోసుకుంటూ తీసుకు వెళ్లారు. అప్పటికే కృష్ణంరాజు మృతి చెందాడు. శ్రీరామ్‌ను రిమ్స్‌లో చేర్పించి వైద్యం అందిస్తున్నారు. మృతుడి తల్లిదండ్రులు వనం లలిత, కనకరాజు రోజువారీ కూలీలు. తమ్ముడు వనం దుర్గాప్రసాద్ అదే పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. ప్రమాద విషయం తెలిసి వెంటనే ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు, జె.ఆర్.పురం సీఐ ఎం.అవతారం, ఎస్‌ఐ చిరంజీవి, ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ చిరంజీవి కేసు నమోదు చేశారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

గ్రామస్తుల ఆందోళన..

పాఠశాల భవనంలో నాణ్యత లోపమే ఈ ప్రమాదానికి కారణమని గ్రామస్తులు ఆరోపించారు. అలాగే ప్రమాదం జరిగిన తర్వాత కొన ఊపిరితో ఉన్న కృష్ణంరాజును అక్షరాలు రాసే బోర్డుపై పాతర్లపల్లి పీహెచ్‌సీకి తీసుకువెళ్లారని, ఉపాధ్యాయుల వద్ద కార్లు ఉన్నా కనీసం స్పందించలేదని ఆందోళన చేపట్టారు. విద్యార్థి మృతి పట్ల వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరఫున రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. గాయపడిన విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

కలెక్టర్ పరామర్శ..

శ్రీకాకుళం: రిమ్స్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థిని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం రాత్రి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.

చెత్త ట్రాలీలో దళిత సర్పంచ్ కుర్చీ

- పంచాయతీ కార్యదర్శి, కూటమి నేతల నిర్వాకం
- పాతటెక్కలిలో దళిత మహిళకు అవమానం
- సచివాలయం వద్ద సర్పంచ్ ఆందోళన



పంచాయతీ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేస్తున్న సర్పంచ్ సుశీల, నాయకులు

వివక్ష

వజ్రపుకొత్తూరు : గ్రామ సచివాలయంలో తన కుర్చీని చెత్త ట్రాలీలో ఇంటికి పంపించి పంచాయతీ కార్యదర్శి, కూటమి నేతలు అవమానించారంటూ వజ్రపుకొత్తూరు మండలం పాతటెక్కలి సర్పంచ్ తుంగాన సుశీల ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం పాతటెక్కలి సచివాలయం వద్ద తన అనుచరులతో కలిసి ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ గ్రామ స్థాయిలో కూటమి నాయకులు అరాచకాలకు అడ్డూఅదుపూ లేకుండా పోతోందన్నారు. సచివాలయంలో తాను ఏర్పాటు చేసుకున్న కుర్చీని చెత్త ఎత్తుకునే ట్రాలీలో తన ఇంటికి పంచాయతీ కార్యదర్శి సీహెచ్ మధు పంపించారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన తన హక్కులు, విధులకు భంగం కలిగించి సచివాలయానికి రాకుండా అడ్డుకుంటున్నారని చెప్పారు. ఇది మహిళా దళిత సర్పంచ్‌కు జరిగిన అవమానం కాదా.. అని ప్రశ్నించారు. ఈ విషయాన్ని ఎంపీడీఓ దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదన్నారు. దీంతో కలెక్టర్, ఎస్సీ కమిషన్, మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయిస్తానని చెప్పారు. సచివాలయ కార్యదర్శి కూడా కూటమి నేతలకు వత్తాసు పలుకుతూ కుర్చీని చెత్త వాహనంతో ఇంటికి పంపించడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. నిరసన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొల్లి జోగారావు, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దాసరి దాలయ్య, టి.ధర్మరాజు, టి.సత్యం, కర్ని వెంకటరమణ, పి.కృష్ణ, ఎస్.రమణ పాల్గొన్నారు.

ముచ్చటగా ముగ్గురికే..



నామినేటెడ్ పోస్టుల్లో సిక్కోలు కూటమి నేతలకు ఆశాభంగం

- వందల్లో ఆశావహులు.. ముగ్గురికే పదవులు
- అందులోనూ రెండు అప్రాధాన్య పోస్టులు
- జనసేన, బీజేపీకి రిక్తహస్తం

అసంతృప్తి

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: నామినేటెడ్ పదవుల కోసం ఆశలు పెట్టుకున్న అధికార కూటమి నేతలకు రిక్తహస్తమే మిగిలింది. ఎప్పుడెప్పుడా అని ఆశగా ఎదురు చూసిన వారంతా తాజాగా చేసిన నియామకాలతో ఒక్కసారిగా డీలాపడ్డారు. జిల్లా వ్యాప్తంగా ముగ్గురికే అవకాశం దక్కింది. అందులో ఒకటి కార్పొరేషన్ చైర్మన్ పదవి కాగా, మిగతా రెండు డైరెక్టర్ పోస్టులే. జిల్లాలో మూడు పార్టీల నేతలు నామినేటెడ్ పోస్టుల కోసం గంపెడాశలు పెట్టుకోగా తీరా భర్తీ చేసేసరికి ముగ్గురికే చోటు లభించడంతో.. మిగతా వారంతా తమ తమ పరిస్థితేంటని ప్రశ్నించుకుంటున్నారు. పదవుల పంపకాలపై అది గో ఇదిగో అంటూ ఊరడించిన చంద్రబాబు తనదైన శైలిలో మొండిచేయి చూపడాన్ని తట్టుకోలేకపోతున్నారు. జనసేన, బీజేపీ నాయకులను కనీసం గుర్తించకపోవడంతో వారంతా ఆవేదనతో రగిలిపోతున్నారు.

అసంతృప్తిలో నేతలు..

అధికారంలోకి వచ్చిన 100రోజుల తర్వాత నామినేటెడ్ పోస్టుల నియామకాలను కూటమి ప్రభుత్వం చేపట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా 20 కార్పొరేషన్లను భర్తీ చేయగా జిల్లాలో కేవలం ముగ్గురికి మాత్రమే పదవులు వరించాయి. అవి కూడా టీడీపీ నేతలకే దక్కాయి. చైర్మన్ పోస్టు దక్కిన వజ్జ బాబూరావు తప్ప మిగతా అందరూ అసంతృప్తిగానే ఉన్నారు. ముఖ్యంగా ఆమదాలవలస టికెట్ ఆశించిన అన్నెపు రాముకు సముచిత స్థానం కల్పిస్తామని నమ్మబలికి ఎన్నికల్లో పనిచేయించుకున్న చంద్రబాబు అండ్‌కో తాజాగా నామినేటెడ్ పోస్టుల భర్తీకొచ్చేసరికి మార్క్‌ఫెడ్ డైరెక్టర్ పదవితో సరిపెట్టేశారు. ఇప్పుడాయన తనకిచ్చిన పోస్టుపై తీవ్ర అసంతృప్తితో ఉన్నట్టు తెలిసింది. ఇచ్చిన పదవిని తీసుకునేందుకు సుముఖంగా లేనట్టు సమాచారం. ఇక, శ్రీకాకుళం మండలానికి చెందిన సీనియర్ టీడీపీ నాయకుడు శీర రమణయ్యకు కూడా అప్రాధాన్యమైన ఏపీ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ పోస్టు కట్టబెట్టారు.

ఆశావహులు వందల్లో..

కూటమి ప్రభుత్వంలో నామినేటెడ్ పదవుల కోసం మూడు పార్టీలకు చెందిన వందలాది నాయకులు ఆశలు పెట్టుకున్నారు.

- ఇచ్ఛాపురం నియోజకవర్గంలో జనసేన నుంచి దాసరి, లోళ్ల రాజేష్, శమళ్ల వరప్రసాద్, టీడీపీ నుంచి కాళ్ల ధర్మారావు, కొండా శంకర్, బొడ్డ హరిబాబు, తమరాల శోభన్‌బాబు, సీపాన వెంకటరమణ, పొందల కృష్ణారావు, బీజేపీ నుంచి బుద్దాల నిర్మలారెడ్డి, నామినేటెడ్ పదవులను ఆశించారు.
- శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి పాండ్రంకి శంకర్, అంబటి లక్ష్మీ రాజ్యం, కంచు దశరథ, గొండు వెంకటరమణమూర్తి, పీఎంజే బాబు, రమణ మాదిగ, జనసేన నుంచి దానేటి శ్రీధర్, కోరాడ సర్వేశ్వరరావు, పిసిని చంద్రమోహన్, బీజేపీ నుంచి పూడి తిరుపతిరావు, బిర్లంగి ఉమామహేశ్వరరావు, పైడి వేణుగోపాల్, శవ్వాన ఉమామహేశ్వరి, చల్లా వెంకటేశ్వరరావు తదితరులు ఆశావహుల్లో ఉన్నారు.
- నరసన్నపేట నియోజకవర్గంలో టీడీపీ నుంచి డోల జగన్, తమ్మినేని భూషణరావు, పంగ బావాజీనాయుడు, మద్దాల భూపాలనాయుడు తదితరులు ఆశిస్తున్నారు.
- టెక్కలి నుంచి ఎల్.ఎల్.నాయుడు, హనుమంతు రామకృష్ణ, చాపర గణపతి, బోయిన గోవిందరాజులు, వెలమట కామేశ్వరరావు తదితరులు ఆశలు పెట్టుకున్నారు.
- ఆమదాలవలసలో జనసేనకు చెందిన పేడాడ రామ్మోహన్‌రావు,
- ఎచ్చెర్ల నుంచి టీడీపీ మాజీ జిల్లా అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, జనసేన నుంచి విశ్వక్‌సేన్ తదితరులు నామినేటెడ్ పదవులపైనే ఆశలు పెట్టుకున్నారు.
- పాతపట్నంలో టీడీపీ నుంచి కలమట వెంకటరమణ వర్గానికి చెందిన నాయకులు, జనసేన నుంచి గేదెల చైతన్య, బీజేపీ నుంచి తేజేశ్వరరావు తదితరులు ఆశావహుల జాబితాలో ఉన్నారు. ఇప్పుడు వారంతా అంతర్మథనంలో పడ్డారు.

జనసేన, బీజేపీలకు గుండు సున్నా..

జనసేన, బీజేపీ నాయకులకు మొండి చేయి ఎదురైంది. మొన్నటి ఎన్నికల్లో జిల్లాలో కొన్ని నియోజకవర్గాల నుంచి పోటీ చేయాలని జనసేన భావించింది. పొత్తులో భాగంగా పవన్ కల్యాణ్ వైఖరితో జిల్లాలో ఒక్కరికీ పోటీ చేసే అవకాశం లేకుండా పోయింది. తన నిర్ణయానికి కట్టుబడి ఉండాలని, అధికారంలోకి వచ్చాక అనేక పదవులొస్తాయని చెప్పడంతో ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. తీరా నామినేటెడ్ పదవుల భర్తీకొచ్చేసరికి జిల్లాలో ఒక్కరికీ చోటు కల్పించలేదు.

క్లుప్తంగా

మల్లేశ్వరరావు నేత్రాలు సజీవం



శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని ఫాజుల్‌బాగ్ పేటలో నివాసముంటున్న టంకాల మల్లేశ్వరరావు(72) అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. మరణానంతరం ఆయన నేత్రాలు ఇతరులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో భార్య ప్రమీల, కుమారులు సురేష్‌కుమార్, నరేష్‌కుమార్, భాస్కరరావు నేత్రదానానికి ముందుకొచ్చారు. విషయం రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియచేయగా.. నేత్ర సేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి సుజాత, సహాయకులు సుమతిలు మృతుడి నివాసానికి చేరుకుని కార్నియాలను సేకరించారు. అనంతరం విశాఖలోని ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. నేత్రదానం చేయాలనుకునేవారు 7842699321 నంబరుకు సంప్రదించాలని బి.మల్లేశ్వరరావు, ట్రెజరర్ దుర్గాశ్రీనివాస్‌లు కోరారు.

స్టోర్ మేనేజర్ నిజాయితీ



రైతులకు బంగారు గొలుసును అప్పగిస్తున్న గణేష్

టెక్కలి: టెక్కలి పాత జాతీయ రహదారిలోని మన గ్రోమోర్ స్టోర్ మేనేజర్ గణేష్ నిజాయితీ చాటుకున్నారు. నందిగాం మండలం చిన్న తామరాపల్లి గ్రామానికి చెందిన రైతులు చమ్మళ్ల కృష్ణారావు, హరికృష్ణ (తండ్రీ కొడుకులు) బుధవారం మన గ్రోమోర్ సెంటర్‌కు వచ్చి పురుగు మందులు కొనుగోలు చేశారు. తమతో పాటు సంచిలో తెచ్చుకున్న బ్యాంకు పుస్తకాలు, తులంన్నర బంగారు గొలుసును మరిచిపోయి వెళ్లిపోయారు. కొంత సమయం తర్వాత సంచిని గమనించిన స్టోర్ మేనేజర్ సంచిలోపల ఉన్న పత్రాల ఆధారంగా రైతుల వివరాలను తెలుసుకుని ఫోన్‌లో సమాచారం అందజేశారు. దీంతో రైతులు వెంటనే వెళ్లి గొలుసు, బ్యాంకు పుస్తకాలను తీసుకుని ఆనందం వ్యక్తం చేశారు. స్టోర్ మేనేజర్ గణేష్‌ను రైతులు అభినందించారు.

స్వయం ఉపాధిలో ఉచిత శిక్షణ

కొత్తూరు: ఉమ్మడి జిల్లా రాజాంలోని నైరడ్ సంస్థలో వివిధ రంగాల్లో స్వయం ఉపాధి శిక్షణ ఇస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ రాజేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి చదివి 19 నుంచి 40 ఏళ్ల వయసు కలిగిన నిరుద్యోగులు ఈ నెల 27న నిర్వహించనున్న ఇంటర్వ్యూలకు హాజరుకావాలని, ఎలక్ట్రికల్ వైరింగ్, జెంట్స్ టైలరింగ్, కంప్యూటర్ టాలీ-బేసిక్స్‌లలో నెల రోజుల పాటు ఉచిత శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. మహిళలకు హోమ్ నర్సింగ్, బ్యూటీ పార్లర్ మేనేజ్‌మెంట్, మగ్గం వర్క్‌లలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

పట్టపగలే ఐదు తులాల బంగారం చోరీ



బాధితురాలు జీవరత్నం

సోంపేట: పట్టణంలోని మహదేవిపేటలో గుంటుకు కామేశ్వరరావు ఇంట్లో బుధవారం పట్టపగలే ఐదు తులాల బంగారం చోరీకి గురైంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. కామేశ్వరరావు భార్య జీవరత్నం ఇంటి వద్దకు బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి మంచినీరు అడిగారు. ఆమె లోపలికి వెళ్తుండగా ఒక్కసారి వెనక్కి నెట్టేసి మెడలో ఉన్న పుస్తెల తాడు, నల్లపూసలు(సుమారు 5 తులాలు) తెంచి ద్విచక్ర వాహనంపై పరారయ్యారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతదేహం వద్ద వద్ద రోదిస్తున్న బంధువులు

రణస్థలం: మండల కేంద్రానికి సమీపంలోని దన్నానపేట వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో యందువ సింహాచలం (51) అనే వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. రణస్థలం మండలం నెలివాడ గ్రామానికి చెందిన సింహాచలం భూ సమస్యలపై ద్విచక్రవాహనంపై తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి తిరిగి వెళుతుండగా బుధవారం మధ్యాహ్నం 3.30 గంటల సమయంలో అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. తల బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సింహాచలం పైడిభీమవరంలోని ఆంధ్రా ఆర్గానిక్స్ పరిశ్రమలో 20 ఏళ్లుగా పనిచేస్తున్నాడు. భార్య నారాయణమ్మ, ఇద్దరు కుమారులు గణేష్, నవీన్ ఉన్నారు. కాగా, బాధిత కుటుంబ సభ్యులు గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడం వల్ల ప్రమాదం జరిగిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి చెప్పారు.

కోళ్ల వ్యాన్ బోల్తా

టెక్కలి రూరల్: మండలంలోని బొప్పాయిపురం జాతీయ రహదారిపై బుధవారం వేకువ జామున కోళ్లవ్యాన్ బోల్తాపడిన ఘటనలో 400పైగా కోళ్లు మృతిచెందగా క్లీనర్‌కు గాయాలయ్యాయి. పార్వతీపురం నుంచి బరంపురం వెళ్తుండగా అదుపు తప్పడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. డ్రైవర్ గేదెల పోలయ్యకు స్వల్ప గాయాలతో బయటపడగా..తీవ్రంగా గాయపడిన క్లీనర్ అప్పలనాయుడుని టెక్కలి జిల్లాఆసుపత్రికి తరలించారు.

వేట సాగదు.. పూట గడవదు

- వరుస వాయుగుండాలతో మత్స్యకారుల ఉపాధికి దెబ్బ
- సెప్టెంబర్‌లో 15 రోజులుగా వేట బంద్
- పైసా సాయం చేయని కొత్త ప్రభుత్వం
- వేట నిషేధం ఎప్పుడో ముగిసినా ఇంకా అందని భృతి

వజ్రపుకొత్తూరు:

వాయుగుండాలు వదలడం లేదు. పడవలు తీరం దాటి కదలడం లేదు. పదిహేను రోజులుగా వేట అన్నదే సాగడం లేదు.. వెరసి మత్స్యకారుడి కంట కన్నీరు ఆగడం లేదు. వరుస వాయుగుండాలు, అల్ప పీడనాలు, తుఫాను హెచ్చరికల నేపథ్యంలో మాటిమాటికీ వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరిస్తుండడంతో మత్స్యకారులు ఈ సెప్టెంబర్‌లో 15 రోజులుగా వేటకు వెళ్లడమే లేదు. అంతకుముందు నెల కూడా అదే పరిస్థితి. ఆగస్టు ముందైతే చేపల సంతానోత్పత్తికి వేట నిషేధ కాలం కావడంతో ఆ రెండు నెలలు సంపాదన అన్నదే లేదు. నాలుగైదు నెలలుగా మత్స్యకారుడి బతుకు కష్టాల సుడిగుండంలో చిక్కుకుపోయింది.



వేట లేక మంచినీళ్లపేట తీరంలో చిరిగిన వలలకు మరమ్మతులు చేసుకుంటున్న మత్స్యకారులు

జిల్లాలోని 193 కిలోమీటర్ల తీర ప్రాంతంలో 11 మండలాల్లో 15,287 మంది మత్స్యకారులు వేటపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. మోటార్ బోట్లపై 1542 మంది, నాన్ మోటరైజ్ బోట్లపై 2499 మంది మత్స్యకారులు ఉన్నారు. వీరు వేటకు వెళితేనే ఆ ఇంటి వారికి పూట గడుస్తుంది. ఈ నెల 1వ తేదీ నుంచి మత్స్యకారులకు తుఫాన్ హెచ్చరికల కారణంగా వేటకు వెళ్లడం మానేశారు. ఆ సమయంలో వారికి కనీసం నిత్యావసర సరుకులైనా అందించాల్సిన బాధ్యత కూటమి ప్రభుత్వానిది. కానీ పాలకులు ఆ విషయాన్ని పట్టించుకోవడమే మానేశారు.

ఏదీ భృతి..?

మరో పక్క జూన్‌లో ముగిసిన వేట నిషేధ కాలానికి మత్స్యకార భరోసాను అందించాల్సి ఉన్నా ఆ పథకాన్ని కూటమి ప్రభుత్వం అటకెక్కించింది. మత్స్యకార బరోసా పథకానికి (వేట నిషేధ కాలానికి) 2024 మే 22న ఎన్యుమరేషన్ చేసిన మత్స్య శాఖ ఆరు దశల్లో వెరిఫికేషన్ పూర్తి చేశాక 12954 మందిని అర్హులుగా తేల్చింది. కానీ నేటి వరకు వారి ఖాతాల్లో పైసా కూడా జమ చేయలేదు. గత ఏడాది అప్పటి ప్రభుత్వం మాత్రం 2023 జూన్ లోనే 13574 మందికి రూ.10వేలు చొప్పున అందజేశారు. ప్రభుత్వం మారాక మత్స్యకారులను పట్టించుకున్న వారే కరువైపోయారు. న్యాయంగా ఇవ్వాల్సిన భృతి ఇవ్వకపోగా.. తుఫాన్ల సమయంలో వారు ఎలా ఉన్నారో కనీసం పట్టించుకునే ప్రయత్నం కూడా చేయలేదని గంగపుత్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చాలా అన్యాయం



గత పది రోజులుగా వేటకు వెళ్లకుండా ఇంటి వద్దే ఉంటున్నాం. మా దరికి ఒక్క ప్రజా ప్రతినిధి కూడా రాలేదు. అధికారులు చేపల వేటకి వెళ్లవద్దని దండోరాలు వేస్తున్నారే తప్ప ఎలా గడుపుతున్నారు, ఏం తింటున్నారని అడిగిన పాపాన పోలేదు. కనీసం నిత్యావసర సరుకులైనా ఇవ్వడం లేదు. మత్స్యకార భరోసా కోసం బడ్జెట్‌లో నిధులు వెచ్చించలేదు. గత ప్రభుత్వంలో ఇలాంటి పరిస్థితి లేదు. వేట నిషేధం పూర్తయిన వెంటనే రూ.10వేలు ఇచ్చేవారు.

– జి.శంభూరావు, మత్స్యకారుడు, మంచినీళ్లపేట, వజ్రపుకొత్తూరు మండలం

పూట గడవని పరిస్థితి



నేను వేటకు వెళ్తే గానీ మా ఇల్లు గడవదు. ప్రస్తుతం రొయ్యిలు పడే సీజన్. మంచి ఆదాయం కోల్పోయాం. 10 రోజులుగా చేపల వేట లేదు. వేట నిషేద భృతి ఇంకా ఇవ్వలేదు. దీంతో ఆర్థికంగా చితికిపోయాం. తుఫాన్ హెచ్చరికల సమయంలో కనీసం బియ్యం, పప్పులు, ఇతర సామగ్రి అయినా సరఫరా చేసి ఉంటే కొంత ఇబ్బంది తప్పేది. వరుస వాయుగుండాలు, తుఫాన్‌ల కారణంగా నాతో పాటే చేపల వేట చేసే వారు చాలా మంది కాండ్లా, బొంబాయి, గోవా తదితర ప్రాంతాలకు వలస పోయారు.

– ఎస్.ముని, మత్స్యకారుడు, మంచినీళ్లపేట, వజ్రపుకొత్తూరు మండలం



తీరంలో లంగరు వేసిన బోట్‌లు

బీసీ వెల్ఫేర్‌లో .. అవినీతి బాగోతం



- అవుట్ సోర్సింగ్ నియామకాల్లో చేతులు మారిన నగదు
- లోకాయుక్త ఫిర్యాదుతో వెలుగులోకి..
- గుట్టుచప్పుడు కాకుండా విజయవాడలో దర్యాప్తు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖలో మరో అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చింది. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకాలు, ఆ సమయంలో తీసుకున్న లంచాలు, తరువాత వారి జీతాలు కాజేయడం తదితర విషయాలు లోకాయుక్త ఫిర్యాదుతో వెలుగుచూశాయి. అయితే దీనికి సంబంధించిన దర్యాప్తు జిల్లాలో కాకుండా విజయవాడలో నిర్వహిస్తుండటం గమనార్హం. జిల్లాలో జరిగితే అవినీతి ఆరోపణలు, ఇతర అక్రమాలు బయటపడతాయన్న భయంతో విజయవాడలో గుట్టుచప్పుడు కాకుండా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

ఇదీ జరిగింది..

2020లో సాంఘిక సంక్షేమ శాఖలో వసతి గృహ విద్యార్థులు తగ్గడంతో హాస్టళ్లు కూడా తగ్గాయి. దీంతో 14 మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు వారి ఉద్యోగాలు కోల్పోయారు. వారిని బీసీ సంక్షేమ శాఖలో ఖాళీలు ఉన్న చోట భర్తీ చేయాలని అప్పటి కలెక్టర్ జె.నివాస్ అప్పటి బీసీ సంక్షేమ అధికారిణిని ఆదేశించారు. అయితే ఆదేశాలు బేఖాతరు చేస్తూ కరోనా సమయంలో నోటిఫికేషన్ లేకుండా అప్పటి జిల్లా సంక్షేమాధికారిణి కృత్తిక తొమ్మిది మంది అవుట్ సోర్సింగ్ (కుక్, కమాటీ, అటెండర్)లను నియమించారు, ఇందులో ఏడుగురు స్థానికులు కాగా, ఇద్దరు రాయలసీమ జిల్లాలకు చెందిన వారు. వీరి వద్ద అప్పట్లో లక్షల్లో వసూళ్లు చేసినట్లు సమాచారం. కాగా జిల్లాలో ఏడు నియామకాలు సంక్షేమ సవతి గృహాధికారులు సిఫార్సులతో నియమితులయ్యారు. వీరు లక్షల్లో ముట్టజెప్పి ఉద్యోగాల్లో చేరినట్లు తెలిసింది. వారిని వాస్తవంగా విధుల్లోకి చేరిన తేదీలు మార్చి వారి ఆరు నెలలు జీతాలు కూడా అప్పటి డీబీసీ, సూపరింటెండెంట్ అధికారులు కాజేశారు. తర్వాత వారికి అపాయింట్‌మెంట్ లెటర్లు ఇచ్చి ఆ సమయం నుంచి మాత్రమే జీతాలు చెల్లించారు. కరోనా సమయం కావడంతో అంతా గుట్టుచప్పుడు కాకుండా జరిగిపోయింది. అవినీతిపై లోకాయుక్తకు ఫిర్యాదు వెళ్లింది. దీంతో లోకాయుక్త ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లింది. నాటి అవినీతి బాగోతంపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయాలని బీసీ సంక్షేమ శాఖ జేడీ శ్రీధర్‌రెడ్డిని ఆదేశించారు. ఈ నేపథ్యంలో సదరు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, వసతి గృహ సంక్షేమాధికారులు, అప్పటి డీబీసీ, కార్యాలయం సూపరింటెండెంట్ కలిసి సుమారు 18 మంది బుధవారం విజయవాడలో జరిగిన విచారణకు హాజరయ్యారు.

ఇంతవరకు వెలుగుచూడకుండా..

బీసీ సంక్షేమంలో ఇంత అవినీతి జరిగినా వెలుగు చూడకపోవడం వెనుక అందరూ తోడుదొంగలుగా మారారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అప్పటి డీబీసీ కృత్తికకు ఈ అవినీతిలో కీలక పాత్ర ఉండగా, ప్రస్తుతం ఉన్న డీబీసీ, సూపరిండెంటెంట్లు ఈ విషయం బయటకు రాకుండా సిబ్బందితో బేరాలు కుదుర్చుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జేడీ విచారణ పూర్తయితే మరింత అవినీతి బయట పడే అవకాశం ఉంది. ఈ శాఖపై విజిలెన్స్, ఏసీబీ దృష్టి సారిస్తే మరిన్ని అవినీతి బాగోతాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

కల్లోల కడలి



శ్రీకాకుళం రూరల్: పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణితో మూడురోజుల పాటు ఉత్తరాంధ్రలో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని ఐఎండీ ప్రకటించిన నేపథ్యంలో పెదగనగళ్లవానిపేట, కుందువానిపేట ప్రాంతాల్లో సముద్రం అల్లకల్లోలంగా మారింది. బుధవారం మత్స్యకారులు వేటకు వెళ్లలేదు. ఈ నెల 28 నాటికి పశ్చిమబెంగాల్, ఒడిశా మధ్య అల్పపీడనం తీరం దాటనున్నట్లు తెలుస్తోంది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ తీవ్రమైన చల్లటి గాలులు, చిన్నపాటి వర్షం పడటంతో బీచ్ పరిసరాలు నిర్మానుష్యంగా మారాయి.

సముద్రంలో మత్స్యకారుడు గల్లంతు



వీరాస్వామి(ఫైల్)

సోంపేట: బారువ మేజర్ పంచాయతీ బారువ కొత్తూరు గ్రామానికి చెందిన మత్స్యకారుడు రట్టి అప్పన్న(47) సముద్రంలో వేటకు వెళ్లి గల్లంతయ్యాడు. రట్టి వీరాస్వామి, ఎర్ర మోహనరావు, లండ యాదవరావుతో కలిసి బుధవారం ఉదయం బోటులో సముద్రంలో చేపల వేటకు వెళ్లిన అప్పన్న.. బోటు బోల్తా పడటంతో సముద్రంలో పడిపోయాడు. ముగ్గురు ఈదుకుంటూ ఒడ్డుకు చేరుకున్నా అప్పన్న ఆచూకీ లభ్యం కాలేదు. గ్రామానికి చెందిన మత్స్యకారులు, మెరైన్ పోలీసులు గాలింపు చర్యలు చేపడుతున్నారు. వీరాస్వామికి భార్య ఆదిలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సనాతన ధర్మాన్ని కాపాడాలి



మాట్లాడుతున్న యార్లగడ్డ లక్ష్మీప్రసాద్

ఎచ్చెర్ల క్యాంపస్: సనాతన నియమాలు కాపాడే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పద్మవిభూషణ్, ప్రముఖ సాహితీవేత్త, రాజ్యసభ మాజీ సభ్యుడు ప్రొఫెసర్ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. ఎచ్చెర్లలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో బుధవారం ప్రొఫెసర్ కొత్త సచ్చిదానందమూర్తి శత జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహనీయులు, తాత్వికులు, ఆధ్యాత్మికవాదుల వారసత్వాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఏయూ ప్రొఫెసర్‌గా, యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ఉపాధ్యక్షునిగా, పలు విశ్వవిద్యాలయాలకు ఉపకులపతిగా కొత్త సచ్చితానందమూర్తి బాధ్యతలు నిర్వర్తించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.ఆర్.రజిని, రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రగతికి కృషి చేయాలి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ

అరసవల్లి: జిల్లాలో ప్రభుత్వ శాఖలకు బదిలీల్లో భాగంగా కొత్తగా జిల్లా స్థాయి అధికారులు విధుల్లోకి చేరుతున్నారని.. వీరంతా కష్టపడి పనిచేసి జిల్లా ప్రగతికి కృషి చేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ ఆకాంక్షించారు. బుధవారం జెడ్పీలో జరిగిన స్థాయి సంఘ సమావేశాల్లో ఆమె మాట్లాడారు. ఉదయం 2వ, 4వ, 7వ, 1వ స్థాయి సంఘ సమావేశాలకు ఆమె అధ్యక్షత వహించగా, మధ్యాహ్నం జరిగిన 3వ, 5వ, 6వ స్థాయి సంఘ సమావేశాలకు పాలిన శ్రావణి, సిరిపురపు జగన్మోహనరావు, జంపు కన్నతల్లి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విజయ మాట్లాడుతూ జిల్లాలో ఇటీవల వర్షాలకు ఛిద్రమైన రోడ్లు బాగు చేయాలని, సాగునీటి కాలువల మరమ్మతు పనులు వేగవంతం చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున పనులు చేసిన కాంట్రాక్టర్ల పెండింగ్ బిల్లులు, చేసిన పనులపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని కోరారు. జిల్లాలో 400 కె.వి.సబ్‌స్టేషన్ ఏర్పాటు వేగవంతం చేయాలన్నారు. రహదారుల్లో గోతులు పూడ్చివేతకు ఏమేరకు నిధులు అవసరమవుతాయో నివేదించాలని ఆర్‌అండ్‌బీ ఎస్ఈ జాన్‌సుధాకర్‌ను ఆదేశించారు. అనంతరం పలు శాఖల ప్రగతిపై సమీక్షించారు. సమావేశంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్, పీఆర్, విద్యుత్, ఉద్యానవన శాఖ, వైద్యారోగ్యశాఖ, వ్యవసాయ శాఖ, జలవనరుల శాఖ తదితర శాఖాధికారులు, జెడ్పీటీసీలు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో వ్యక్తికి గాయాలు

పొందూరు : మండలంలోని కనిమెట్ట గ్రామ శివారులో ఉన్న చెరువు పక్కన పొలంలో పని చేసుకుంటున్న సింగూరు వాసుదేవరావు ఇంటికి వస్తుండగా తేనెటీగలు దాడి చేశాయి. వెంటనే స్పందించిన స్థానికులు కింతలి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకువెళ్లగా.. డాక్టర్ శివకుమార్ వైద్యసేవలందించారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని చెప్పారు.

విభిన్న ప్రతిభావంతులకు ఉచిత ఉపకరణాలు

శ్రీకాకుళం పాతబస్టాండ్: విభిన్న ప్రతిభావంతులకు ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్‌ఫోన్లు, మూడు చక్రాల సైకిళ్లు, వీల్ చైర్లు, చంక కర్రలు, చేతికర్రలు, వినికిడి యంత్రాలను అందజేస్తామని, అర్హులైన వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఏడీ కె.కవిత బుధవారం ఒక ప్రకటనలో కోరారు. సమీప సచివాలయంలో గానీ, ఇంటర్నెట్ సెంటర్‌లో గానీ సదరం, ఇతర ధ్రువపత్రాలు అందజేసి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ దుకాణాలకు మద్యం సరఫరా

ఎచ్చెర్ల క్యాంపస్: ప్రభుత్వ మద్యం దుకాణాలకు మంగళవారం సాయంత్రం నుంచి మద్యం సరఫరా ప్రారంభించారు. ఈ నెల 18 నుంచి సరఫరా నిలిచిపోయిన సంగతి తెలిసిందే. దుకాణాలకు మద్యం సరఫరా చేస్తున్న ట్రాన్స్‌పోర్టు వాహనాలకు బేవరేజెస్ కార్పొరేషన్ లక్షల్లో రవాణా చార్జీలు బకాయి పడింది. మరోవైపు అక్టోబర్ 1 నుంచి కొత్త మద్యం పాలసీ అమల్లోకి రానుంది.

దళితులపై దాడులు తగవు

- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ రుషి



పొన్నాడ రుషి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కూటమి ప్రభుత్వంలో రెడ్‌బుక్ రాజ్యాంగమంటే దళితులపై దాడులు చేయడమా అని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ రుషి మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వంద రోజుల్లో కూటమి పాలనంతా దళితులనే లక్ష్యంగా పెట్టుకుని దాడులు చేయడం సరికాదన్నారు. 100 రోజుల పండుగలు చేసుకుంటున్న పాలకులు.. బలహీనవర్గాల కోసం ఏం చేశారో చెప్పాలన్నారు. నాలుగు రోజుల కిందట మీరు చేసిన దౌర్జన్యాలకు పరాకాష్ట రఘురామకృష్ణంరాజు చేసిన ఆటవిక చర్య అని, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ ఫ్లెక్సీలు చింపి దుర్భాషలాడటం హేయమైన చర్యగా అభివర్ణించారు. పంతం నానాజీ ఓ వైద్యుడ్ని దూషించి చెంపదెబ్బ కొట్టడాన్ని ఖండించారు. బేషరతుగా మీ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ హ్యూమన్ రైట్స్ వారు స్పందించి బాధ్యులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు.

జాతీయ వెయిట్ లిఫ్టింగ్ పోటీలకు ఐదుగురు ఎంపిక



పతకాలతో క్రీడాకారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా నుంచి రికార్డు స్థాయిలో ఐదుగురు వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. హిమాచల్‌ప్రదేశ్ వేదికగా అక్టోబరు 6 నుంచి 13 వరకు జరిగే ఈ పోటీలకు సీనియర్ విభాగంలో జి.సునీల్ (102 కేజీలు), ఎస్.తరుణ్ (81 కేజీలు), యూత్ విభాగంలో డి.హేమశ్రీ(55 కేజీలు), జి.వర్షిత(64 కేజీలు), జూనియర్ విభాగంలో జి.లలిత (64కేజీలు) ఎంపికయ్యారు. ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో వీరంతా పతకాలతో రాణించారు. క్రీడాకారులను జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ కార్యదర్శి కొత్త కోట శ్రీనివాసరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఐ.భాస్కర రావు, మధుసుదనరావు, కోచ్ ఐ.అప్పన్న, డీఎస్‌డీఓ శ్రీధర్‌రావు బుధవారం అభినందించారు.

100 రోజుల పాలనలో కూటమి ప్రభుత్వం విఫలం



ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కూటమి ప్రభుత్వం 100 రోజుల పాలనలో పూర్తిగా విఫలమైందని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి కృష్ణ ధ్వజమెత్తారు. బుధవారం కలెక్టరేట్ వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చకపోవడం తగదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి గాదం వెంకట్ త్రినాథ్ మాట్లాడుతూ తిరుపతి వెంకటేశ్వర స్వామి లడ్డూ ప్రసాదం విషయంలో అపవిత్రం జరిగితే సీబీఐ విచారణ వేయాల్సిన ముఖ్యమంత్రి కాలక్షేప కబుర్లు చెబుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఈశ్వరి, రెళ్ల సురేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐలో బంగారం మాయం కేసు.. పోలీసు విచారణ మళ్లీ ప్రారంభం

- అప్పటి రీజనల్ మేనేజర్‌తో సహా పది మందిని విచారిస్తున్న డీఎస్పీ



గార ఎస్బీఐ వద్ద గుమికూడిన ఖాతాదారులు (ఫైల్)

శ్రీకాకుళం క్రైమ్ : గతేడాది రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన గార స్టేట్‌బ్యాంక్ బంగారం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇప్పటికే ఈ కేసులో బంగారాన్ని పోలీసులు రికవరీ చేయడంతో పాటు కొందరు నిందితులను అరెస్టు చేసినా.. కేసుకు సంబంధించి అనేక సందేహాలు ప్రశ్నార్థకంగానే మిగిలిపోయాయి. ఈ నేపథ్యంలో కొత్తగా వచ్చిన డీఎస్పీ సీహెచ్ వివేకానంద విచారణ మళ్లీ ప్రారంభించారు. అప్పటి రీజనల్ మేనేజర్ తోటకూర రమణమూర్తి రాజు సహా మరో పది మందిని (నలుగురు ఆడిటర్లు, బ్యాంకు మేనేజర్ రాధాకృష్ణ, చంద్రశేఖర్ సహా) విచారణ కోసం బుధవారం తీసుకువచ్చారు. పూర్తి వివరా లు తెలియాల్సి ఉంది. మరోవైపు, తనఖా బంగారం మాయమైన ఉదంతంలో రమణమూర్తి రాజు పోలీసులను సైతం తప్పుదోవ పట్టించార న్న ఆరోపణలు ఉన్నాయి. ఆభరణాలు తాకట్టుపెట్టి ఆ సొమ్మును ఎవరు వాడుకున్నారు? క్యాషి యర్‌ను మార్గమధ్యలో కొట్టారని పెట్టిన కేసు ఏమైంది..? బంగారు నగలు పోయాయని నవంబరు 30న రీజనల్ మేనేజర్ ఫిర్యాదు ఇచ్చిన ముందు జరిగిన ఆడిట్‌లో తనఖా బంగారం పోలేదంటూ ఎందుకు నివేదిక ఇచ్చారో.. ఇవన్నీ నేటికీ ప్రశ్నార్థకమే. కేసులో ఆర్‌ఎం పాత్ర ఏంటన్నది ఇప్పటికీ తేలకపోగా.. ఓ నిండు ప్రాణం (బ్యాంకు అకౌంటెంట్ స్వప్నప్రియ) బలవ్వడం బ్యాంకు వర్గాల్లోను, జిల్లావాసులను తీవ్రంగా కలచివేసింది.

చనిపోయేంతవరకు..

బ్యాంకు ఉద్యోగిని చనిపోయేంతవరకు ఆమెపై ఎటువంటి ఆరోపణలు చేయని బ్యాంకు ఉద్యోగులు, ఆర్ఎం రాజు.. ఆమె మరణానంతరం వారి కుటుంబసభ్యులపై నెట్టడం, ఆమే అన్నింటికీ కారణంగా వేలుచూపెట్టడం అప్పటి విచారణ చేసిన కొంతమందిపై అనుమానాలకు తావిస్తోంది. ఈ నేపథ్యంలో తమకు అన్యాయం జరిగిందని, తమ కుటుంబాన్ని అకారణంగా ఇరికించారని, అంతా ఆర్ఎం రాజే వెనకుండి నడిపించారంటూ స్వప్నప్రియ తల్లి ఉరిటి సరళ నేషనల్ హ్యూమన్ రైట్స్, ఉమెన్ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. ఈలోగా ఎస్పీ రాధిక బదిలీ కావడం.. కొత్తగా వచ్చిన ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి సైతం పెండింగ్ కేసుపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో డీఎస్పీ వివేకానంద విచారణ కొనసాగిస్తున్నారు.

దినసరి వేతనదారుల నియామకాలపై విచారణ



విచారణ చేపడుతున్న ఆర్జేసీ సుబ్బారావు

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో కొంత కాలంగా విధుల్లో ఉన్న దినసరి వేతనదారుల ఇబ్బందులపై దేవదాయ శాఖ కమిషనర్‌కు నివేదిస్తానని విచారణాధికారి, రీజనల్ జాయింట్ కమిషనర్ కె.సుబ్బారావు అన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిపిన 48 మంది దినసరి వేతనదారుల నియామకాలపై విచారణ చేసేందుకు బుధవారం అరసవల్లి ఆలయానికి విచ్చేశారు. ముందుగా ఈవో రమేష్‌బాబు, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు గౌరవ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. అనంతరం ప్రత్యేకంగా దినసరి వేతనదారులతో ఆయన మాట్లాడి వారి నియామకాలు జరిగిన తీరు, చేపడుతున్న విధుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని వారంతా ఆవేదన వ్యక్తం చేయడంతో ఉన్నతాధికారులకు నివేదించామని, వారి ఆదేశాల ప్రకారం చర్యలుంటాయని వివరించారు.

చట్టాలపై అవగాహన అవసరం

శ్రీకాకుళం పాతబస్టాండ్: చట్టాలపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాధికారి సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. స్థానిక న్యాయ సేవా సదన్‌లో బుధవారం 'విధాన్ సే సమాధాన్' పేరిట పోస్టల్ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయ సేవాధికార సంస్థ అందిస్తున్న సేవలను వివరించారు. కార్యక్రమంలో భాగంగా పోస్టల్ అధికారులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.